క్లుప్తంగా

ఉత్తమ సేవలకు పురస్కారం



సీపీ స్టీఫెన్ రవీంద్రతో ఎస్‌ఐ సయీద్

కొత్తూరు: కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సయీద్ ఉత్తమ పురస్కారం అవార్డుకు ఎంపికై య్యారు. బుధవారం సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్‌రవీంద్ర చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తోటి సిబ్బందితో పాటు పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

షాద్‌నగర్‌రూరల్: ఉత్తమ సేవలకు పలువురు పోలీసులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఉత్తమ సేవా పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటయ్యలకు సీపీ చేతుల మీదుగా సేవా పతాకాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ అధ్యక్షుడు స్వరాజ్‌బాబు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్వరాజ్‌బాబు

షాద్‌నగర్: ఆధ్యాత్మికతతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ అధ్యక్షుడు స్వరాజ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో దాతల సహకారంతో రూపొందించిన విష్ణుసహస్రనామ పారాయణ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరాజ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఆధ్యాత్మిక చింతన హిందూ ధర్మాన్ని కాపాడుతుందని చెప్పారు. దాతల సహకారంతో విష్ణుసహస్రనామ పారాయణం పుస్తకం ప్రచురించినట్లు తెలిపారు. విష్ణు సహస్రనామ పారాయణం కోసం సొంత భవనాన్ని నిర్మించేందుకు తగిన కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త బెజవాడ నర్సింలు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో పాండురంగం, నర్సింలు, మాణిక్యం, శ్రీరాం, మురళీ, జనార్దన్, మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి, భద్రకాళి మాత కల్యాణోత్సవం



కల్యాణోత్సవం జరిపిస్తున్న పూజారులు, వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: కన్నుల పండువగా పచ్చని తోరణాలతో పూల పందిరిని అలంకరించి నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి దేవాలయాన్ని వేదపండితులు, పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి హోమం నిర్వహించి వీరభద్రస్వామి, భద్రకాళి మాత కల్యాణాన్ని బుధవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు విగ్రహాల జలదివాసం, ధాన్యవాసం, మహాయజ్ఞం నిర్వహించారు. మూడవ రోజు గురువారం దేవాలయ గర్భగుడిలో విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది. ఈ కల్యాణ మహోత్సవంలో వేదపండితులతో పాటు దేవాలయానికి స్థలం ఇచ్చిన దాత కోట్ల సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ గూడురు లక్ష్మీశ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, కేశంపల్లి గోవింద్‌రెడ్డి, అనంతరెడ్డి సతీసమేతంగా కళ్యాణోత్సవం, హోమంలో పాల్గొన్నారు. ఈ పూజల్లో కోట్ల బల్వంత్‌రెడ్డి, కోట్ల సత్తిరెడ్డి, యాదిరెడ్డి, నివాస్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

క్రికెట్ విజేత జిల్లేడ్ చౌదరిగూడ జట్టు

కొందుర్గు: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని శ్రీరంగాపూర్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శుల జట్లు పోటీల్లో తలపడగా జిల్లేడ్ చౌదరిగూడ జట్టు విజేతగా నిలిచింది. టాస్ గెలిచిన జిల్లేడ్ చౌదరిగూడ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 8 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేయగా కొందుర్గు జట్టు 8 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 61 పరుగులకు ఆలౌటైయింది. విజేత జట్టుకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఆంజనేయులు, మహేష్‌బాబు, ఎంపీఓలు లాలయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధంతో సమానం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో విద్యావంతుల కన్నా నిరక్షరాస్యులే ఎక్కువ శాతం ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఓటుకు ఉన్న విలువ దేనికీ లేదన్నారు.



కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కేశంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ రవీందర్



షాబాద్: సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్



చేవెళ్ల : ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది



శంకర్‌పల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

'కంటి వెలుగు'తో దృష్టి సమస్యలకు చెక్

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జయలక్ష్మి

షాద్‌నగర్: అర్హులైన వారందరు విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. బుధవారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో వైద్య సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న వారందరు కంటి వెలుగు శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని శిబిరానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. దగ్గరి చూపు సమస్య ఉన్న వారిని గుర్తించి కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్య తీవ్రంగా ఉంటే వారిని హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు స్రవంతి, రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ రమ, తుకారాం, అశ్విని, భారతి, వెంకటమ్మ, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలి

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: క్రీడాకారులు స్నేహభావంతో వ్యవహరించాలని పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాల్మీకి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, ఓటమి గెలుపునకు నాందీగా భావించాలన్నారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు మోహన్‌సింగ్, నరసి ంహయాదవ్, శంకర్, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని ధర్నా



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను ఇష్టానుసారంగా పెంచారని వెంటనే తగ్గించాలని మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లి, పత్తేపురం, రామంతపురం, బుల్కాపురం, సింగాపురం గ్రామ పంచాయతీలను కలుపుకొని శంకర్‌పల్లి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలోని ఇళ్లకు, ప్రైవేట్ మడిగెలు తదితర వాటికి ఒక్కసారిగా 10ఇంతలు పన్ను భారం పెంచడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇంటి పన్నులు పెంచడం జరిగిందని, పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇంటి పన్నులు చెల్లించాలంటే ప్రజలకు భారంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు వందల్లో ఉన్న పన్నులు ప్రస్తుతం వేలల్లో వేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. ఉదయమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి వసంతం, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వై. ప్రకాష్‌గుప్త, నాయకులు రవీందర్‌రెడ్డి, మోహన్, ఎజాస్, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్ ముదిరాజ్, యాదయ్యగౌడ్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే రాద్ధాంతం



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధికోసం లేని పోని ఆరోపణలు చేస్తున్నా రని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శంకర్‌పల్లి, బుల్కాపురం, సింగాపురం, పత్తేపురం, రామంతపురం గ్రామ పంచాయతీలను కలుపుకొని శంకర్‌పల్లి మున్సిపాలిటీని 02-08 -2018వ సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో నివాస భవనాలు, వాణిజ్య భవనాలకు వేర్వేరుగా పన్ను విధింపు లేదన్నారు. పురపాలక సంఘం ఏర్పడిన మొదటి సంవత్సరం గ్రామ పంచాయతీ సమయంలో ఉన్న పన్నులను వసూలు చేయడం జరిగిందన్నారు. తదుపరి జీయో ట్యాగింగ్ ద్వారా ఇంటి కొలతలు, భవనం ఫొటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ విలువ ప్రకారం, నిర్మాణం విలువల ప్రకారం పన్నులను విధించడం జరిగిందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ విలువలు పెరగడం, వాణిజ్య భవనాలకు కమర్షియల్ ట్యాక్స్‌లు వేయడం వల్ల పన్నుల విధింపులో ఒకేసారి హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని, గతంలోనే మున్సిపాలిటీ పాలకవర్గంలో ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో పన్నులను తగ్గించాలని తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపడం జరిగిందని వివరించారు. తాము ప్రజల పక్షాన నిలువడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ చంద్రమౌళి, మున్సిపల్ టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



క్రీడా దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ లావణ్య

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొండకల్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొండకల్ జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, కొండకల్ తండా ప్రాథమిక పాఠశాలల్లో కొండకల్ సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో 400మంది విద్యార్థులకు క్రీడా దుస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అలాగే, సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభను కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రామ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, ఉపాధ్యాయులు రఘునందన్‌రెడ్డి, యాదమ్మ, కుసుమకుమారి, అంజిరెడ్డి, శ్రీనివాస్, సుజాత, జంగయ్య, రాములు, రాధారెడ్డి, హరికృష్ణ, యాదయ్య, అరుంధతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రోత్సాహం

టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ లలిత



టూల్ కిట్స్,మెటీరియల్ అందజేస్తున్న లలిత

మొయినాబాద్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి సంస్థ(టీఎస్‌డబ్ల్యూసీడీసీ) చైర్‌పర్సన్ ఆకుల లలిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రంలో సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్టక్చర్ కోర్సులో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మహిళలతో మాట్లాడి శిక్షణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మహిళలకు టూల్ కిట్స్, మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంకోసం ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందన్నారు. సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్టక్చర్ శిక్షణ పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇలాంటి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ శైలకుమారి. సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫొటోను విధిగా పెట్టాలి

అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం సుబ్రహ్మణ్యం



అంబేద్కర్ చిత్రపటాన్ని ఇస్తున్న నారాయణదాస్

షాద్‌నగర్‌టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసే ప్రతి చోట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను విధిగా పెట్టాలని అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘీక ఆర్థిక రాజకీయ న్యాయం జరిగినప్పుడే అందరికి సమాన అవకాశాలు దక్కుతాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావించారని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఫొటో పెట్టాలి

చేవెళ్ల: గణతంత్ర దినోత్సవంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను తప్పనిసరిగా పెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత నారాయణదాస్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ఏసీపీ రవీందర్‌రెడ్డికి, ఎమ్మార్వో శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు, తదితరులకు బుధవారం ఆయన అంబేద్కర్ చిత్రపటాలను అందజేసి గణతంత్ర దినోత్సవంలో పెట్టేలా అందరికి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టుకోకపోవడమంటే ఆయనను అవమానించడమే అవుతుందన్నారు.

గౌడ సంఘం నేత మృతి

షాద్‌నగర్: షాద్‌నగర్ గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల అంజయ్య గౌడ్ (80) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. వృద్ధాప్యంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, నక్కల అంజయ్యగౌడ్ షాద్‌నగర్ ప్రాంతంలో మద్యం వ్యాపారం నిర్వహిస్తూ, గౌడ్ సంఘంలో కీలకంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయితే, ఆయన మరణవార్తను తెలుసుకున్న పలువురు వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, గౌడ సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఆయన స్వగృహానికి చేరుకున్నారు. అంజయ్యగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గ్రామాల్లో జోరుగా బెల్ట్ షాపులు

- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
- కిరాణా దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



కిరాణం దుకాణంలో నిల్వ ఉంచిన బీర్లు

షాబాద్: మండలంలో ఏ గ్రామంలో చూసిన బెల్టుషాపులు జోరుగా కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. వైన్స్ షాపులు మూసి ఉన్నాయా అయితే ఏం ఫర్వాలేదు. చెంతనే బెల్ట్ షాపులు ఉన్నాయి కదా అక్కడికి వెళితే సరి మద్యం పుష్కలంగా దొరుకుతుంది. హెచ్చరించిన బెల్ట్‌షాపు నిర్వాహకులకు చెవికెక్కడం లేదు. దీనికి తోడు ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహారించడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. వేళాపాలాలే కుండా 24 గంటల పాటు లభించే మద్యం దుకాణాలు గ్రామాల్లో ఉన్నాయి. దీంతో పాటు తండాల్లో సారాబట్టీలు పెట్టి మద్యం విక్రయాలు, బెల్టుషాపుల ద్వారా బాహాటంగా నడుస్తున్నాయి. ఇదేంటి ఇంతా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదా అని అనుకుంటున్నారా వారంతా పచ్చనోట్లకు దాసోహం అయ్యారు. అందువల్లే ఒక చిన్నగ్రామంలో కూడా 3 నుంచి 5 వరకు బెల్టు దుకాణాలున్నాయి. వీటిని మూసి వేయాల్సిందేనని ప్రభుత్వం అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీచేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లో బెల్ట్‌షాపులు ఉండకూడదని స్వయంగా సీఎం ప్రకటించినా అధికారుల్లో చలనం లేదు. కొన్ని గ్రామా ల్లో తాగడానికి నీరు దొరకపోయినా, మద్యం మాత్రం తప్పకుండా దొరుకుతుంది.

పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు..

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు మొదలుకొని అనుబంధ గ్రామాల్లో కూడా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని పట్టించుకోనే పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహారిస్తున్నారు. దీంతో బెల్ట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. కొన్ని గ్రామాలకు ఇతర ప్రాంతాల నుంచి ఆటోల్లో కల్తీ మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. బెల్ట్ దుకాణాల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియులను దోచేస్తున్నారు. వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని డబ్బులు దండుకుంటున్నారు. ఈ అడ్డగోలు ధరలతో అధికారులను కూడా మచ్చిక చేసుకున్నట్లు తెలుస్తుంది. దీంతో వారు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఏదో నామమాత్రపు తనిఖీలు నిర్వహించి, చూసీచూడన్నట్లు వ్యవహారిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ వ్యాపారాన్ని అడ్డుకుంటేనే కొంత వరకైనా ప్రజలకు మేలు జరుగుతుందని ఆయా గ్రామాల యువజన సంఘాల సభ్యులు వాపోతున్నారు.

చేవెళ్ల ఎక్సైజ్ సీఐ రాకేష్ వివరణ...

ఈ విషయమై ఎక్సైజ్ సీఐ రాకేష్‌ను వివరణ కోరగా గ్రామా ల్లో బెల్టుదుకాణాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వైన్స్ షాపుల యాజమానులు కూడా అధిక ధరలకు మద్యం విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.